సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం | 27 | ఏప్రిల్ | 2024




నగదు స్వాధీనం

సార్వత్రిక ఎన్నికల సోదాల్లో భాగంగా పెనుగొండ నుంచి విజయవాడ వెళుతున్న కారును తనిఖీ చేయగా రూ.70,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸



కనకదుర్గమ్మగా రాట్నాలమ్మ

రాట్నాలకుంటలో రాట్నాలమ్మవారి తిరునాళ్లు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు కనకదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 8లో ▸



వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

ఎన్నికల సమీపిస్తున్న సమయంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు మరింత జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

వాగులో మునిగి ముగ్గురు మృతి



వాగు ప్రాంతంలో ముగ్గురి మృతదేహాలు

జంగారెడ్డిగూడెం రూరల్: సరదాగా జల్లేరు ప్రాంతానికి వచ్చి వాగులో మునిగి ముగ్గురు మృతిచెందిన విషాద ఘటన జంగారెడ్డిగూడెం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జీలుగుమిల్లి మండలం దిబ్బగూడెం గ్రామానికి చెందిన మౌలాలి జంగారెడ్డిగూడెం మండలం జల్లేరు వాగులో చేపల వేట సాగిస్తుంటాడు. తెలంగాణలోని అశ్వారావుపేటకు మండలం ఊట్లపల్లి గ్రామానికి చెందిన షేక్ రేష్మ, అతని సోదరుడు షేక్ హసద్‌లు బంధువు అయిన మౌలాలి ఇంటికి దిబ్బగూడెం వచ్చారు. శుక్రవారం మౌలాలితో పాటు అతడి భార్య మొహిషాద్ (23), రేష్మ (24), హసద్ (14), మరో వ్యక్తి జల్లేరు ప్రాంతానికి సరదాగా వచ్చారు. మౌలాలీ చేపల వేటకు వల కోసం వెళ్లిన సమయంలో మొహిషాద్, రేష్మ, హసద్ జల్లేరు వాగులోకి దిగి ప్రమాదవశాత్తు మునిగి గల్లంతయ్యారు. వీరు స్నానానికి దిగారని, సెల్ఫీ తీసుకుంటుండగా మునిగిపోయారని స్థానికులు అంటున్నారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి ముగ్గురి మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. మృతురాలు రేష్మ హైదరాబాద్‌లో స్థిరపడింది. జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర, సీఐ రాజేష్, ఎస్సై జ్యోతిబాస్ ఘటనా స్థలానికి వచ్చి దర్యాప్తు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషాద ఘటనతో మృతుల కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

చెరువులకు నీటి సరఫరా

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా రెండు రోజులుగా కృష్ణా కెనాల్ నుంచి విడుదలైన నీరు పంట కాలువ ద్వారా వేగంగా గ్రామాలకు పారేందుకు పనులు చేస్తున్నారు. ఉపాధి హామీ కూలీలతో కృష్ణ కెనాల్‌లో గుర్రపుడెక్క తొలిగించారు. జాలిపూడి పంట కాలువలో చేరిన ప్లాస్టిక్ వ్యర్థాలు, మాదేపల్లి, జాలిపూడి, శ్రీపర్రు కాలువ గట్లపై చెత్తాచెదారం తొలిగించారు. మాదేపల్లి, జాలి పూడి కూడలి వద్ద కాలువ నీటిని పంపింగ్ చేయడాన్ని శుక్రవారం ఈఓపీఆర్డీ ఎం.సరళ కుమారి పరిశీలించారు.

రూ.207 కోట్ల విలువైన ధాన్యం సేకరణ

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో 8,143 మంది రైతుల నుంచి రూ.207.31 కోట్ల విలువైన 1,05,638 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. శుక్రవారం ఆమె వివరాలు వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి 15,575 మంది రైతులకు చెందిన 1,26,274 టన్నుల ధాన్యాన్ని నమోదు చేశామన్నారు.



మాకు ఓటు లేకున్నా..

మేమంతా జగన్ మావయ్యకు అండగా ఉంటాం.. మా ఇళ్లల్లోని ఓట్లన్నీ జగన్ మావయ్యకే వేయిస్తాం.. అంటూ చిన్నారులు వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యక్రమానికి స్వచ్ఛందంగా తరలివచ్చారు. మా బడులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని, విద్యాకానుక, అమ్మఒడి, గోరుముద్ద వంటి పథకాలతో పేద విద్యార్థుల చదువులకు భరోసాగా నిలిచారని నినాదాలు చేశారు. గణపవరంలో కనిపించిన దృశ్యమిది.

- గణపవరం

వైఎస్సార్ పింఛన్ కానుకతో

అవ్వాతాతలకు కొండంత అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అంతటా నీరాజనాలు అర్పిస్తున్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడుతున్నారు. ఏలూరు 50వ డివిజన్ ఎంఆర్‌సీ కాలనీలో కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఆర్ఎం పెదబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించగా.. ఓ వృద్ధురాలు వైఎస్సార్‌సీపీ బ్రోచర్‌పై ఉన్న సీఎం జగన్ చిత్రపటాన్ని ముద్దాడుతున్న దృశ్యం ఆకట్టుకుంది.

- ఏలూరు టౌన్



గురువులకు గౌరవం

- ఉద్యోగాలిచ్చి ఆదుకున్న సీఎం జగన్
- గత డీఎస్సీల అభ్యర్థులకూ కొలువులు
- ఏళ్ల నాటి కల సాకారం
- జిల్లాలో 722 మందికి ఉద్యోగాలు
- ప్రభుత్వ విద్యారంగంలో మైలురాయి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యతోనే అభివృద్ధి సాధ్యమని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. దీనిలో భాగంగా ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న డీఎస్సీల అభ్యర్థులకు ఉపాధ్యాయ కొలువులు అందించారు. గత ప్రభుత్వాలు డీఎస్సీ పరీక్షలు నిర్వహించి పలు కారణాలతో ఉద్యోగాలు భర్తీ చేయకుండా వదిలివేసిన అభ్యర్థులకు సీఎం జగన్ పూర్తిస్థాయిలో న్యాయం చేశారు. ఇలా 1998, 2008 డీఎస్సీల క్వాలిఫైడ్ అభ్యర్థులకు, 2018 డీఎస్సీ అభ్యర్థులకు జగన్ హయాంలో ఉద్యోగాలు ఇచ్చి వారి కుటుంబాలకు అండగా నిలిచారు.

డీఎస్సీలు ఎవరు నిర్వహించినా ఉద్యోగాలిచ్చింది జగనే..

1998లో చంద్రబాబు ముఖ్యమంత్రి ఉండగా, 2008లో కాంగ్రెస్ అధికారంలో ఉండగా డీఎస్సీలు నిర్వహించారు. 2018లో చంద్రబాబు పాలనలో మరోసారి డీఎస్సీ నిర్వహించారు. రాష్ట్రంలో వేలాది మంది నిరుద్యోగులు పరీక్షలు రాసి అర్హత సాధించారు. తమకు ఉద్యోగాలొస్తాయని, ఉపాధ్యాయ వృత్తిలో చేరవచ్చని ఆశగా ఎదురుచూసిన వారికి నిరాశే ఎదురయ్యింది. అటువంటి కుటుంబాలకు జగన్ ప్రభుత్వం భరోసా కల్పించింది.

దశాబ్దాల కలలకు రూపం : డీఎస్సీల్లో అర్హత సాధించిన వారు ఉద్యోగాల కోసం చూస్తూ సంవత్సరాలు గడిచిపోయాయి. డీఎస్సీలో అర్హత సాధించినా తమకు ఎందుకు ఉద్యోగాలు రావడం లేదో వారికి అర్థం కాక నిస్తేజంలో ఆశలు వదులుకున్నారు. కొందరు చిన్నపాటి ప్రత్యామ్నాయాలు చూసుకున్నారు. అటువంటి సమయంలో సీఎం జగన్ దేవుడిలా వారి కలలను సాకారం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వేల కుటుంబాలకు ఆసరాగా నిలిచారు. ఇలా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 700 మందికి పైగా అభ్యర్థులకు ఉపాధ్యాయ కొలువులు అందించారు.



పాఠశాలలో గ్రీన్ చాక్‌బోర్డ్‌పై పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

722 ఉపాధ్యాయ ఉద్యోగాలు

1998, 2008 డీఎస్సీలు రాసి అర్హత సాధించినా ఉద్యోగాలు రాని వారు కొందరైతే.. 2018 డీఎస్సీలో అర్హత సాధించిన ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారు మరికొందరు ఉన్నారు. దాదాపు 20 ఏళ్లుగా కొలువు కోసం ఎదురుచూస్తున్న వారికి జగన్ ప్రభుత్వం తీపికబురు చెప్పింది. 1998, 2008 డీఎస్సీల్లో అర్హత సాధించిన వారికి మినిమం టైం స్కేల్ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించింది. అలా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 452 మందికి ఉద్యోగాలిచ్చి గౌరవించింది. అలాగే గత ప్రభుత్వం నిర్వహించిన 2018 డీఎస్సీకి సంబంధించి అర్హులైన 270 మందికి నేరుగా కౌన్సెలింగ్ నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చింది. అప్పటి నుంచి ఉపాధ్యాయ ఉద్యోగాలివ్వాలంటే జగనే అధికారంలో ఉండాలనే అభిప్రాయం అటు బీఈడీ ఉత్తీర్ణులైన వారితో పాటు ప్రస్తుత ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికీ బలంగా నాటుకుంది.

కుటుంబ సభ్యుల్లా చూసుకుంటూ..



సీఎం జగన్ రాష్ట్రంలో ఉపాధ్యాయులను కుటుంబసభ్యుల్లా చూసుకుంటున్నారు. వారికి అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నారు. గతంలో ఉపాధ్యాయుల కొరతతో పనిచేస్తున్న వారిపై ఒత్తిడి ఉండేది. పాత డీఎస్సీల్లో అర్హులైన వారికి మినిమమ్ టైమ్ స్కేల్ విధానంలో జగన్ ఉద్యోగాలు కల్పించడంతో ఇప్పుడు పనిభారం తగ్గింది. నాడు- నేడుతో పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించడం, డిజిటల్ తరగతులు వంటివి తీసుకురావడంతో బోధన మరింత సులభతరమైంది.

– గెద్దం సుధీర్, వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

వందల కుటుంబాలకు జీవం



ఉద్యోగాల కోసం 20 ఏళ్లకుపైగా ఎదురుచూస్తున్న డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు సీఎం జగన్ ఉద్యోగాలిచ్చి ఆదుకున్నారు. దీంతో పాటు ఆయా కుటుంబాలకు జీవం పోశారు. డీఎస్సీ అర్హులైనా ఉద్యోగాలు రాక కొందరు అభ్యర్థులు కూలి పనులు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. అటువంటి వారంతా ఇప్పుడు ఉద్యోగాలు చేసుకుంటూ సంతోషంగా జీవిస్తున్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులందరినీ రెగ్యులరైజ్ చేస్తే ముఖ్యమంత్రి ఫొటోను మందిరాల్లో పెట్టుకుని పూజిస్తారు.

– తోట ఎడ్వర్డ్, ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

వైఎస్సార్‌సీపీకే ముస్లింల మద్దతు



ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు మద్దతు తెలుపుతున్న ముస్లిం నాయకులు

భీమవరం: పట్టణంలోని 21వ వార్డులో చిన్న మసీదుకు చెందిన ముస్లిం నాయకులు శుక్రవారం వైఎస్సార్‌సీపీ నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆమె క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గుంటి ప్రభు ఆధ్వర్యంలో ఉమాబాలను కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ ముస్లిం, మైనార్టీ, ఎస్సీ, బీసీలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తున్నారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పేదలకు రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే మరలా వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముస్లిం నాయకులు మాట్లాడుతూ అన్నివర్గాలకు అండగా ఉంటున్న సీఎం జగన్‌ను తిరిగి అధికారంలో కూర్చోబెట్టడానికి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. భీమవరం ఎమ్మెల్యేగా గ్రంధి శ్రీనివాస్, నరసాపురం ఎంపీగా ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో శనివారం నుంచి ఇంటింటికీ బీఎల్‌ఓల ద్వారా ఓటర్ల ఇన్ఫర్మేషన్ స్లిప్పుల పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రజారంజక పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు తిరిగి గెలిపిస్తారని, వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని మంత్రి కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ కార్యక్రమం పూర్తయిందని ఇకపై ప్రతి క్షణం చాలా విలువైందన్నారు. పార్టీ శ్రేణులు, అభిమానులు కష్టించి పనిచేసి అభ్యర్థులకు భారీ మెజార్టీ తీసుకురావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పలు పథకాలను అమలు చేసి అందరి అభిమానాన్ని చూరగొన్నారన్నారు. రాష్ట్రంలో గొప్ప పాలనకు ఆయన పునాది వేశారని అన్నారు. రాష్ట్రంలో పాలనా విధానాలపై దేశంలోని పలు రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయని చెప్పారు. ప్రజారంజక పాలన చేస్తున్న సీఎం జగన్‌ను తిరిగి ప్రజలు పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న తమ ప్రభుత్వానికి మరోసారి మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, అప్సడా వైఎస్ చైర్మన్ వడ్డి రఘురాం, ఎంపీపీలు దాసరి హైమావతి, పానుకుమాటి శేషులత, జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, నిమ్మల నాని, బంగారు నాగు, గొర్రెల శ్రీనివాస్, కొలుకులూరి ధర్మరాజు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

పక్కాగా నామినేషన్ల పరిశీలన

- నరసాపురం ఎంపీ స్థానంలో 6 నామినేషన్ల తిరస్కరణ
- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 124 నామినేషన్లు
- స్క్రూటినీ అనంతరం 99 నామినేషన్ల ఆమోదం



భీమవరం కలెక్టరేట్‌లో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం(ప్రకాశం చౌక్): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శుక్రవారం జిల్లాలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సజావుగా సాగింది. భీమవరం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ పత్రాల స్క్రూటినీ ప్రక్రియను నిర్వహించారు. జనరల్ అబ్జర్వర్ ఎం.దీప సమక్షంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి చీఫ్ ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, వారి మద్దతుదారుల సమక్షంలో పరిశీలన ప్రక్రియను సజావుగా నిర్వహించారు. ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఈనెల 18న ప్రారంభమై 25 వరకు జరగ్గా మొత్తంగా 27 మంది అభ్యర్థులు 39 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన అనంతరం 21 మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాలు సక్రమంగా ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. మిగిలిన ఆరుగురు అభ్యర్థుల నామినేషన్లలో ముగ్గురు ప్రధాన పార్టీ అభ్యర్థులకు మద్దతుదారులుగా వేయడం, ఇద్దరు అభ్యర్థుల నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి పది మంది ప్రతిపాదకుల మద్దతు సంతకాలు లేకపోవడం, ఒక అభ్యర్థి ఫారం ఏ-బీ, అఫిడవిట్ సమర్పించకపోవడంతో వాటిని తిరస్కరించారు.

ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు..

జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించి ఆయా నియోజకవర్గాల వారీగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) సమక్షంలో నామినేషన్ల పరిశీలన జరిగింది. మొత్తంగా 124 మంది నామినేషన్లు దాఖలు చేయగా స్క్రూటినీలో 25 మంది నామినేషన్లు తిరస్కరించగా 99 మంది బరిలో నిలిచారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇలా..

- **తణుకు:** తణుకు నియోజకవర్గానికి మొత్తం 16 మంది నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలన అనంతరం 13 మంది నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని అధికారులు నిర్ధారించి ముగ్గురి నామినేషన్లు తిరస్కరించారు.
- **ఆచంట:** ఆచంట నియోజకవర్గానికి మొత్తం 14 మంది నామినేషన్లు సమర్పించారు. పరిశీలన అనంతరం 11 మంది నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని అధికారులు నిర్ధారించి ముగ్గురి నామినేషన్లను తిరస్కరించారు.
- **నరసాపురం:** నరసాపురం నియోజకవర్గానికి మొత్తం 15 మంది నామినేషన్లు దాఖలు చేశారు. స్క్రూటినీ అనంతరం 12 మంది నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని అధికారులు నిర్ధారించి.. ముగ్గురి నామినేషన్లను తిరస్కరించారు.
- **పాలకొల్లు:** పాలకొల్లు నియోజకవర్గానికి మొత్తం 19 మంది నామినేషన్లు సమర్పించారు. పరిశీలన అనంతరం 16 మంది నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని అధికారులు నిర్ధారించారు. ముగ్గురి నామినేషన్లను తిరస్కరించారు.
- **ఉండి:** ఉండి నియోజకవర్గానికి మొత్తం 21 మంది నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలన అనంతరం 17 మంది నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని అధికారులు నిర్ధారించారు. నలుగురు నామినేషన్లు తిరస్కరించారు.
- **తాడేపల్లిగూడెం:** తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి మొత్తం 20 మంది నామినేషన్లు సమర్పించారు. స్క్రూటినీలో 13 మంది నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని అధికారులు నిర్ధారించారు.ఏడుగురి నామినేషన్లు తిరస్కరించారు.
- **భీమవరం:** భీమవరం నియోజకవర్గానికి మొత్తం 19 మంది నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలన అనంతరం 17 మంది నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని అధికారులు నిర్ధారించారు. ఇద్దరి అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించారు.

కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలి

భీమవరం: వేసవిలో అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా కార్మికులు, వివిధ రంగాల్లో పనిచేసే వారికి యాజమాన్యాలు రక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి కోరారు. రాష్ట్ర విపత్తు నివారణ సంస్థ హెచ్చరికలకు అనుగుణంగా దుకాణాలు, సంస్థల్లో పనిచేసే వారికి, ఫ్యాక్టరీలు, భవన నిర్మాణం, కర్మాగారాల్లో పనిచేసే కార్మికుల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పని గంటలను రీ-షెడ్యూల్ చేయాలని, ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అత్యవసర మందులు, ఎమర్జెన్సీ ఐస్ ప్యాక్స్, ప్రథమ చికిత్స సామగ్రి వంటివి అందుబాటులో ఉంచాలన్నారు. డీహైడ్రేషన్ నివారించే మార్గాలపై కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు పోస్టర్లను ప్రదర్శించాలన్నారు.

2 నుంచి వేసవి క్రికెట్ శిక్షణ

ఏలూరు రూరల్: వచ్చేనెల 2 నుంచి 22 వరకు 19 ఏళ్లలోపు బాలబాలికలకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఆదిత్యవర్మ, కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు ప్రకటనలో తెలిపారు. బాలురుకు ఏలూరు సీఆర్ఆర్ డిగ్రీ కాలేజ్ ఆవరణలో కోచ్ జి.సత్యనారాయణ (9490472111), భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో టి.శ్రీనివాస్ (9110502929) శిక్షణ అందిస్తారని వెల్లడించారు. బాలికలకు ఎస్.రమాదేవి (7989153915), పి.ప్రియాంక (8328043304) డీఎన్నార్ కళాశాలలో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఆధార్, పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రాలతో పాటు సొంత కిట్‌తో వచ్చేనెల 2న ఉదయం 6 గంటలకు హాజరుకావాలని, మరిన్ని వివరాలకు కోచ్‌లను సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

క్లుప్తంగా

కనకదుర్గాదేవి అలంకరణలో రాట్నాలమ్మ



కనకదుర్గ అలంకరణలో దర్శనమిచ్చిన రాట్నాలమ్మ అమ్మవారు

పెదవేగి: రాట్నాలకుంటలో వేంచేసియున్న శ్రీ రాట్నాలమ్మ అమ్మవారి తిరునాళ్లు వైభవంగా జరుగుతున్నాయి. తిరునాళ్లలో భాగంగా శుక్రవారం నాలుగో రోజు అమ్మవారు శ్రీకనకదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు విఘ్నేశ్వర పూజ నవగ్రహ మండపార్చన, పరిసర దేవతార్చన, కుంకుమార్చనలు జరిగాయి. అనంతరం మేళతాళాలు, కోలాట భజనలు, నృత్యాలతో రాట్నాలకుంట, రాయన్నపాలెం, కొండలరావుపాలెం గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు కుంకుమార్చన, మంగళహారతి మంత్రపుష్పం, ప్రసాద వితరణ అందించారు. లక్ష్మీపురం మహిళల కోలాట ప్రదర్శన అలరించింది. రాత్రి 8 గంటలకు అమ్మవారి కోనేరులో తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం దువ్వకు చెందిన శ్రీదానేశ్వరి ఫైర్‌వర్క్స్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చారు. సన్నీ ఈవెంట్స్ హైదరాబాద్ వారిచే సినీమ్యూజికల్ నైట్ ఆకట్టుకుంది. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

బిడ్డతో సహా మహిళ అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బిడ్డతో సహా మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు. వివరాల ప్రకారం చల్లవారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన ఓ మహిళ వివాహమై ఐదేళ్ల పాప ఉంది. అనారోగ్యంతో ఐదేళ్ల క్రితం భర్త చనిపోవడంతో సోదరుడి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 21వ తేదీ సాయంత్రం నుంచి తల్లీకూతుళ్లు కనిపించడం లేదు. చుట్టుపక్కల, బంధువుల ఇంటి వద్ద వాకబు చేసినా వారి ఆచూకీ తెలియకపోవడంతో మహిళ సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన చెల్లెలు కనిపించకపోవడానికి సందిపోగు ఆశీర్వాదం అనే వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

జగన్ ప్రభుత్వంలోనే నిజమైన అభివృద్ధి

నెగ్గిపూడి ప్రచారంలో ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు



మార్టేరు సెంటర్‌లో గజమాలతో శ్రీరంగనాథరాజుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

పెనుమంట్ర: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం నెగ్గిపూడి, వనంపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా తమ గ్రామానికి వస్తున్న శ్రీరంగనాథరాజుకు గ్రామసర్పంచ్ మామిడిశెట్టి ధనలక్ష్మి, ఉప సర్పంచ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అల్లం సాయిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పెనుగొండ లక్ష్మి ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున మార్టేరు సెంటర్‌లో గజమాల, గుమ్మడి హారతులతో రంగనాథరాజుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం తీన్‌మార్ వాయిద్యాలతో గ్రామంలో ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుకువాడ మాట్లాడుతూ నెగ్గిపూడి, వనంపల్లి గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు జగనన్న ప్రభుత్వంలోనే పరిష్కారమయ్యాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపనలు, శిలాఫలకాలతోనే సరిపెట్టి ప్రజలను మభ్యపెట్టిందని, గ్రామంలో నారా లోకేష్ వేసిన శంకుస్థాపన శిలాఫలకం కూడా నిర్మాణం జరగలేదని విమర్శించారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఎటువంటి శంకుస్థాపనలు లేకుండానే వనంపల్లి గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న రోడ్లు, డ్రెయిన్‌లను సిమెంట్ రోడ్లు, డ్రెయిన్‌లుగా నిర్మించి అభివృద్ధి చేశామన్నారు. ఫ్యాన్ గుర్తుకే రెండు ఓట్లు వేసి మరోసారి తనను, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను గెలిపించడం ద్వారా మరోసారి వైఎస్ జగన్‌ను సీఎం చేయాలని ఓటర్లను అభ్యర్థించారు. పార్టీ సీనియర్ నాయకుడు అల్లం బులిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్ పర్సన్ వెలగల వెంకటరమణ, గ్రామ సర్పంచ్ మామిడిశెట్టి ధనలక్ష్మి, ఉప సర్పంచ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అల్లం సాయిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పెనుగొండ లక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు అల్లం భాస్కరరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు సత్తి వెంకటరెడ్డి, మండల మాజీ కన్వీనర్ సత్తి విష్ణుకుమార్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం కార్యవర్గ సభ్యుడు కీర్తి కనకయ్య, పాలసత్తి రాజ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగన్‌ని ఆశీర్వదించండి

పాతనవరసపురం ప్రచారంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



పాతనవరసపురంలో ఓట్లు అభ్యర్థిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్ : ప్రజలకు సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని, ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులకు బుద్ధి చెప్పాలని వైఎస్సార్ సీపీ నరసాపురం నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. పాతనవరసపురం గ్రామంలో ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోమారు ఆదరించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తాము వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నామంటూ ప్రసాదరాజుకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజల్లో జగనన్నకు ఆదరణ పెరుగుతున్న తరుణంలో దుష్టచతుష్టయం ఓర్వలేపోతోందన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేతలు, మహిళలు ప్రసాదరాజుకు అడుగడుగునా హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ప్రసాదరాజు గడపగడపకూ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తూ ఎన్నికల ప్రచార కరపత్రాలను అందజేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజలు మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, అంద్రాజు చల్లారావు, ఎంపీపీ మైలాబత్తు సోని, తిరుమాని శంకర్, జాకబ్‌రాజు, కిషోర్, బర్రి శివశంకర్, గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

భీమవరాన్ని రూ.130 కోట్లతో అభివృద్ధి చేశాం

భీమవరం ప్రచారంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరంలో ప్రచారం నిర్వహిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణాన్ని ఐదేళ్లలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన పట్టణంలోని ఒకటి, రెండు, నాలుగు, ఐదు వార్డులలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం పట్టణంలో సుమారు రూ.130 కోట్లకు పైబడి నిధులతో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. ప్రతి వార్డులో కూడా తాను చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. అంతేకాకుండా పట్టణానికి ప్రతిరోజు కోటి లీటర్ల మంచినీరు ప్రజలకు సరఫరా చేస్తుండగా, దీని సామర్థ్యాన్ని రెండు కోట్ల 80 లక్షల లీటర్ల వరకు పెంచామన్నారు. రాబోయే రోజుల్లో పట్టణ ప్రజలకు 24 గంటల పాటు తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో రైల్వే గేటు ఉన్న ప్రతి చోట కూడా అండర్ టన్నెల్స్ ను నిర్మించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపామని వెల్లడించారు. భీమవరంలో భూమిని సేకరించి 8 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామన్నారు. అన్నారు. భీమవరం పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న తనను ఎన్నికల్లో మరోసారి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర యువత నాయకులు గ్రంధి రవితేజ, పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, ముత్యాల బాబులు, రామిశెట్టి జయ సూర్య, పాలవెల్లి మంగ, పేరిచర్ల సత్యనారాయణ రాజు, కృష్ణంరాజు, అల్లూరి రాజేష్ నాగవల్లి, గాదిరాజు రామరాజు, చెల్లబోయిన సూర్యప్రకాష్, పేరిచర్ల విజయ నరసింహారాజు, తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కూటమికి బుద్ధి చెప్పాలి

వైఎస్సార్ సీపీ పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి



పాలకొల్లు 18వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

పాలకొల్లు అర్బన్ : సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఓటర్లను కోరారు. పట్టణంలోని 18వ వార్డు బెత్లహేంపేట, రాజీవ్ కాలనీ, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం గుడాల గోపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్ రెండోవసారి ప్రమాణ స్వీకారం చేయగానే అవ్వాతాతలకు వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ పంపించే ఏర్పాటు చేస్తారని చెప్పారు. పేద, మధ్య తరగతి వర్గాలతో పాటు అగ్రవర్ణ పేదలంతా సంతోషించేలా సీఎం జగన్ మ్యానిఫెస్టో సిద్ధం చేస్తున్నారన్నారు. పాలకొల్లు పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతానన్నారు. ప్రధాన సమస్యలపై తనకు అవగాహన ఉందని, అధికారంలోకి వచ్చిన 6 నెలలలోపు వాటిని పరిష్కరిస్తానన్నారు. అలాగే పట్టణంలో ఉన్న అన్ని మునిసిపల్ పార్కులను అభివృద్ధి చేసి ఆహ్లాదకర వాతావరణం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని గోపి స్పష్టం చేశారు. ఫ్యాన్ గుర్తుకే రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. డీసీఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, వార్డు ఇన్‌చార్జ్ రామాంజుల పెదమధు, వార్డు నాయకులు కొండేటి వరదరాజులు, పసుపులేటి వీరాస్వామి, సనమండ వీరాస్వామి, రామాంజుల చినమధు, సనమండ సురేష్, పసుపులేటి రమేష్, సాలా శ్రీను, బండి రమేష్, పెచ్చెట్టి కృష్ణాజి, మద్దా చంద్రకళ, పెదపాటి పెద్దిరాజు, షేక్ ఛాంద్‌బీబీ, చెన్ను విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే గిరిజనుల అభ్యున్నతి



వేలేరుపాడు మండలంలోని గ్రామాల్లో ప్రచారంలో వైఎస్సార్ సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి

వేలేరుపాడు: జగనన్న ప్రభుత్వంతోనే గిరిజనుల అభ్యున్నతి సాధ్యమైందని, పోలవరం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని భూదేవిపేట, బండలబోరు, మల్లారం, జిన్నెలగూడెం, తెల్లిపల్లి, కొర్రాజుగూడెం, చెరువుగొల్లగూడెం, చాగరపల్లి, పడమటిమెట్ట, నార్లవరం కాలనీ, తదితర గిరిజన గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్ నవరత్నాల పథకాలతో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. ఐదేళ్ళ కాలంలో ప్రజలకిచ్చిన హామీలను వందశాతం అమలు చేశారని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2.50 లక్షల కోట్లను ప్రజల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా జమ చేశారన్నారు. ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్ళీ సీఎంను చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ఉజ్వల భవిష్యత్తు



గణపవరం ప్రచారంలో మహిళలకు ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: ఎలాగైనా అధికారం దక్కించుకోవాలన్న ఏకైక లక్ష్యంతో ప్రజాదరణలేని పెత్తందార్లందరూ ముఠాకట్టి బూటకపు హామీలతో ప్రజలను ఏమార్చడానికి వచ్చారని, వారి బూటకపు హామీలను నమ్మవద్దని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం రాత్రి జగన్నాథపురంలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో రాష్ట్రం సంక్షేమ రాజ్యంగా అవతరించిందని, ఐదేళ్ల పాలనలో పేదలకు నూరుశాతం న్యాయం జరిగిందని అన్నారు. సిఫార్సులు, లంచాలు లేకుండా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమచేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. టీటీడీ సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు నౌడు వెంకట రమణ, గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, సర్పంచ్ మూర అలంకారం పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా నిత్యం ప్రజల్లోనే ఉన్నా

ముదినేపల్లిలో ప్రజాప్రతినిధుల సమావేశంలో ఎమ్మెల్యే డీఎన్నార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు/మండవల్లి: అభ్యర్థి కామినేని శ్రీనివాస్ ఓడినా, గెలిచినా అమెరికా, హైదరాబాదులో ఉంటారని, తాను గెలిచిన నుంచి నిత్యం నియోజకవర్గ గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉన్నానని, ఆలోచించి ఓటు వేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోరారు. భైరవపట్నం శుభం ఫంక్షన్ హాలులో ముదినేపల్లి మండల ప్రజాప్రతినిధుల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు గోట్రూ ఏసుబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాల్లో డబ్బు శాశ్వతం కాదన్నారు. ఇటీవల పార్టీని వీడిన జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు మధ్యలో వచ్చి మధ్యలోనే పోయారన్నారు. త్వరలో నియోజకవర్గ పర్యటనకు సీఎం వైఎస్ జగన్ వస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని బీజేపీ ప్రకటించిందని, క్రిస్టియన్, ముస్లింలు ఆ పార్టీకి ఓటు వేసే పరిస్థితి లేదన్నారు. టిప్పర్ డ్రైవర్‌కు సీటు ఇచ్చి తాను పేదల పక్షపాతి అని సీఎం నిరూపించుకున్నారన్నారు. కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర గౌడ సంఘ ఉపాధ్యక్షుల పోసిన చెంచురామారావు, వైఎస్సార్ సీపీ నేత బీవీ రావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సీనియర్ నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు మాట్లాడుతూ డీఎన్నార్ గెలుపునకు కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీలు రాచూరి రాధ, చొప్పర్ల సునీత, నాయకులు ఈడే వెంకటేశ్వరరావు, బేతపూడి వెంకటరమణ, జాస్తి బాబూ రాజేంద్రప్రసాద్, శీలం రామకృష్ణ, బత్తిన కిషోర్, మరీదు నాగయ్య, కోమటి విష్ణువర్ధన్, పోకల కృష్ణ, రాచర్ల సుబ్రహ్మణ్యం తదితర నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీల్లో నగదు స్వాధీనం

ఉంగుటూరు: ఉంగుటూరులో ఎన్నికల చెక్‌పోస్టు వద్ద శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.70,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆర్వో ఖాజావలి చెప్పారు. పెనుగొండ నుంచి విజయవాడకు కారులో తనిఖీలు చేయగా, ఎటువంటి ఆధారాలు లేకుండా మడిచర్ల అప్పారావు, నౌడు దుర్గారావు అనే వ్యక్తులు రూ.70,500 నగదు తీసుకువెళుతున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నగదును సీజ్ చేసి ట్రెజరీకి అప్పగించామని ఆర్వో వివరించారు.

డీఈఎల్ఈడీ పరీక్షకు 112 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో శుక్రవారం నిర్వహించిన డీఈఎల్ఈడీ మూడో సెమిస్టర్ పరీక్షకు 63 మందికి 60, ఒకటో సెమిస్టర్ పరీక్షకు 54 మందికి 52 మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదుగురు గైర్హాజరయ్యారని, ఈ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.

టీడీపీ, జనసేనను వీడి.. వైఎస్సార్ సీపీలోకి



తూర్పుపాలెంలో శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన పెదమల్లం కాపు నేతలు



ముద్రగడ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన నాయకులు



నెగ్గిపూడిలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన శెట్టిబలిజ యువకులతో రంగనాథరాజు



భీమవరంలో వైఎస్సార్ సీపీలో చేరిన స్వర్ణకారులతో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

పెనుగొండ: ఆచంట మండలం పెద్దమల్లం గ్రామానికి చెందిన 50 మంది కాపు సంఘ నాయకులు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. శుక్రవారం తూర్పుపాలెంలో కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఆదిమూలం వెంకటరాయుడు, ఆదిమూలం పెదమాచియ్య, చిరపల్లి సూర్యనారాయణ, దిరిశాల రామారావు, ఎడ్ల సుబ్బారావు, బళ్ళ ఆనందరావు, బీర పెద్దిరాజు, వాగ్లళ సత్తిబాబు, దిరిశాల వెంకట్రాజు, దిరిశాల పుల్లారావులతో పాటు పలువురు నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఉందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ సీఎం జగన్‌కు అండగా నిలుస్తున్నారన్నారు. పార్టీ విజయానికి అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిరిశాల విజయలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ కొండేటి భవాని ప్రసాద్, బోడపాటి సూరిబాబు, బోడపాటి మాచిరాజు ఆదిమూలం మాచిరాజు, మాతా గణేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన స్వర్ణకారులు

భీమవరం: భీమవరం నియోజకవర్గానికి చెందిన స్వర్ణకారులు స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో స్వర్ణకారులు పార్టీలో చేరడం సంతోషకరమని అన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూడా నెరవేర్చారని వెల్లడించారు. రాజకీయాల్లో విశ్వసనీయతకు నిలువుటద్దం సీఎం వైఎస్ జగన్ అన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో కూడా ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. నవరత్నాల పథకాల రూపంలో ప్రజలకు నేరుగా లబ్ధి అందించి అన్ని వర్గాలకు అండగా నిలిచారన్నారు. భీమవరం నియోజకవర్గంలో ఐదేళ్లలో అనేక శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి కార్యక్రమాలను చేశామన్నారు. వచ్చే నెల 13న జరగనున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను, భీమవరంలో తనను ప్రజలు అఖండ మెజార్టీతో గెలిపించాలని శ్రీనివాస్ కోరారు. అదే మాదిరిగా స్వర్ణకారుల సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరించిందని, రాబోయే రోజుల్లో కూడా స్వర్ణకారులకు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుప్పిలివరం, తోట భోగయ్య, చెల్లబోయిన సూర్య ప్రకాష్, స్వర్ణకారులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి శెట్టిబలిజ యువత

పెనుమంట్ర: నెగ్గిపూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం ఆచంట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన పార్టీ బీసీ సెల్ నాయకులు జుత్తిగ దుర్గాప్రసాద్, కుడిపూడి సత్యనారాయణ, ఉపసర్పంచ్ అల్లం బాలసాయిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన పిల్లి రమేష్, కేతా శ్రీను, చెల్లంగి ధనశేఖర్, కుక్కల ప్రభాకర్, కుక్కల విజయ్‌లకు శ్రీరంగనాథరాజు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగనన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

ముద్రగడ సమక్షంలో చేరిన జనసేన నాయకులు

ఆకివీడు: ముద్రగడ పద్మనాభం పిలుపు మేరకు పలువురు జనసేన యువకులు వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. వారికి ముద్రగడ, ఉండి అసెంబ్లీ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు పార్టీ కండువా వేసి స్వాగతం పలికారు. వీరంతా సైనికుల్లా పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం అయ్యే వరకూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పీవీఎల్ మాట్లాడుతూ పవన్ రాజకీయ హీరో కాదని యువత నమ్ముతోందన్నారు. పలువురు యువకులు ప్రతి రోజూ వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని చెప్పారు.

క్లుప్తంగా

ఏడు నామినేషన్ల తిరస్కరణ



స్క్రూటినీ కార్యక్రమంలో డిప్యూటీసీఎం కొట్టు సత్యనారాయణ, ఆర్‌ఓ కె.చెన్నయ్య

తాడేపల్లిగూడెం: ఈ నెల 18 వ తేదీ నుంచి 25 వరకు దాఖలైన నామినేషన్లను శుక్రవారం ఆర్‌ఓ కార్యాలయంలో అభ్యర్థుల సమక్షంలో స్క్రూటినీ జరిగింది. ఎన్నికల పరిశీలకులు ఐఏఎస్ అధికారి ఎల్.నిర్మలరాజ్ పర్యవేక్షణలో నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా సహేతుకమైన పత్రాలు సమర్పించినందుకు ఏడు నామినేషన్లను తిరస్కరించగా బరిలో 13 మంది ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులు దేవతి పద్మావతి, పెదమూర్తి రాజేంద్ర, ఎంవీవీఎల్‌నారాయణ, గెద్దాడ సువర్ణరాజు, కట్ల గంగరాజు నామినేషన్లతో పాటు వైఎస్సార్ సీపీ తరపున రెండో సెట్టు నామినేషన్ వేసిన కొట్టు సొదానికుమారి నామినేషన్‌ను (కొట్టు సత్యనారాయణ నామినేషన్‌ను ఆమోదించినందున) తిరస్కరించారు. బహుజనసమాజ్ పార్టీ తరుపున నామినేషన్ వేసిన కొత్తపల్లి వెంకటేశ్వరరావు నామినేషన్‌ను తిరస్కరించారు. ఈ స్క్రూటినీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ పాల్గొన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి శుక్రవారం సందర్భంగా ఆలయం వద్ద విశేష పూజలు జరిగాయి. భక్తులు, దాతల సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పర్యవేక్షించారు.

నేడు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష జరిగే ప్రదేశాలివే

పెంటపాడు: గూడెం పట్టణంలో ఈనెల 27న జరిగే పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షను పదోతరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాలిసెట్ -24 జిల్లా కోఆర్డినేటర్ ఫణీంద్ర ప్రసాద్ తెలిపారు. గూడెంలో జరిగే పరీక్షకేంద్రాలను ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడెం జెడ్పీస్కూల్, కడకట్ల గోయంకా ఉమెన్స్ కళాశాల, వాసవి డిగ్రీ కళాశాల, శశి ఇంజనీరింగ్ కళాశాల కేంద్రాల్లో జరిగే పరీక్షకు విద్యార్థులు సకాలంలో చేరుకోవాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థిని నల్లప్రియను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదోతరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల నుంచి టూ టౌన్‌లోని తాళ్ళముదునూరుపాడు మాగంటి అన్నపూర్ణదేవి ఓరియంటల్ బాలికోన్నత మున్సిపల్ పాఠశాల విద్యార్థినీ నల్ల ప్రియ (586/600) తాడేపల్లిగూడెం నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. అదే విధంగా జిల్లా స్థాయిలో నాల్గోవ ర్యాంక్ సాధించడం అభినందనీయమని పాఠశాల హెచ్‌ఎం నిమ్మల శ్రీనివాసరావు సంతోషం వ్యక్తం చేశారు. అదే విధంగా విద్యార్థినీ నల్ల ప్రియకు డీవైఈఓ రవీంద్రభారతి, ఎంఈఓలు పీఎంకే జ్యోతి, హనుమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

తణుకు టౌన్: విద్యార్థి నీలు చదువుతో పాటు స్వావలంబన కలిగి ఉండాలని రిటైర్డ్ జిల్లా జడ్జి అడబాల లక్ష్మీ చెప్పారు. శుక్రవారం తణుకులోని ఎస్‌కెఎస్ డీ మహిళా కళాశాలలో జరిగిన విద్యార్థినీలు ఫేర్‌వెల్ కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా జడ్జి అడబాల లక్ష్మీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా రిటైర్డ్ జడ్జి లక్ష్మీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగం పట్ల అవగాహన, భాధ్యతలను తెలుసుకోవాలన్నారు. సమాజం పట్ల భాధ్యత కలిగి ఉండాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, కళాశాల కోశాధికారి నందిగం సుధాకర్, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సంకు మనోరమ, విద్యార్థినీలు పాల్గొన్నారు.

పాఠశాల హెచ్‌ఎం దత్ ఆకస్మిక మృతి

అత్తిలి: బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్(62) శుక్రవారం తెల్లవారుజామున తాడేపల్లిగూడెంలో ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. హెచ్‌ఎం దత్ అకస్మికంగా మృతిచెందడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు. హెచ్‌ఎం దత్ మృతి పట్ల మండల విద్యాశాఖాధికారులు ఎం రమేష్, ఎంఈఎల్‌కే ప్రసాద్, జిల్లా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు నేలపాటి వెంకటరమణ, పాఠశాలల ఉపాధ్యాయులు భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

సంక్షేమమే ముద్దు.. జన్మభూమి కమిటీలు వద్దు

- జగనన్న సంక్షేమం ఆదుకుందంటున్న పేదలు
- జన్మభూమి కమిటీలంటే బెంబేలెత్తిపోతున్న ప్రజలు
- రాబందుల్లా పీక్కుతిన్నారంటున్న వైనం



తణుకులో కాపు నేస్తం సంక్షేమ పథకం చెక్కు ఆవిష్కరించిన మంత్రి కారుమూరి (ఫైల్)

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 58 నెలల సంక్షేమ పాలనను ప్రజలు వేనోళ్ల పొగుడుతున్నారు. జగనన్న ప్రవేశపెట్టిన 37 రకాల సంక్షేమ పథకాలు చరిత్రలో నిలుస్తుండగా 40 ఏళ్ల ఇండస్ట్రీగా చెప్పుకునే చంద్రబాబు హయాంలో అమలైన జన్మభూమి కమిటీల పేరు గుర్తొస్తే చాలు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పేదలను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో సంక్షేమ పథకాలు సృష్టించి అవినీతికి తావులేకుండా గడపలోకే అందించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించగా, రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు సృష్టించిన జన్మభూమి కమిటీలు పేదలను జలగలు, రాబందుల్లా పీక్కుతిన్నాయంటూ ప్రజలు దుమ్మెతిపోస్తున్నారు. టీడీపీ కార్యకర్తలను అందిన కాడికి దోచుకు తినమని ప్రవేశపెట్టిన జన్మభూమి కమిటీలద్వారా అప్పటి నాయకులు, కార్యకర్తలు లక్షలాది రూపాయిలు దోచుకున్నవైనాన్ని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

జన్మభూమి కమిటీల రూటే సెపరేటు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు స్ఫూర్తితో తణుకు నియోజకవర్గంలో అప్పటి మాజీ ఎమ్మె ల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఏర్పాటుచేసిన జన్మభూమి కమిటీలు రూటే సెపరేటుగా పనిచేశాయి. ఒక్కో వార్డుకు ఒక్కో కమిటీ ద్వారా కొంతమంది ముఖ్య నాయకులను కమిటీలో చేర్చారు. అయితే స్థానికంగా ఉన్న ప్రజలు తమ సమస్యల పరిష్కారంకోసం వెళ్లిన సందర్భంలో ప్రతి పనికి ఒక రేటు పెట్టి దోచుకుతిన్నారు. పనికోసం వచ్చినవారు కడు పేదలైనా సరే ససేమిరాఅంటూ వారిని నిట్టనిలువునా దోచేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా తెలుపు రంగు కార్డు కావాలన్నా, కొత్త పింఛను కావాలన్నా వేలల్లో వారికి చెల్లిస్తేనే తప్ప ప్రజలకు పనికాని దుస్థితి. పైగా ఆ పనిచేయించేందుకు ఆయా కార్యాలయాల్లో సదరు అధికారులకు ఇవ్వాలంటూ చెప్పిన క్రమంలో ఇటు రెవెన్యూ, అటు మునిసిపల్ కార్యాలయాల్లో ఉద్యోగులు తలలు పట్టుకునే పరిస్థితి. దీంతో వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటేస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయనే భయంతో ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు.

తాజాగా దుమారం రేపిన లోకేష్ వ్యాఖ్యలు

ఇటీవల జిల్లాలో జరిగిన బహిరంగ సభలో టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త రైస్ కార్డు ఇవ్వాలన్నా, కొత్త పింఛను ఇవ్వాలన్నా మా కౌన్సిలర్లు చెప్పిన వారికే ఇస్తాం అంటూ లోకేష్ వారి మనస్సులో ఉన్న ఉద్దేశాన్ని బయటపెట్టేశారు. కాదూ కూడదు అంటే సహించబోం అంటూ చేసిన హెచ్చరికలు సైతం జారీచేయడంతో ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి.

పేదలను రాబందుల్లా పీక్కు తిన్నారు



టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏ పని చేయాలన్నా ఒక రేటు నడిచేది. కొత్తగా పింఛను కావాలంటే ఎవరైనా చనిపోతే ఆ పింఛను స్థానంలో కొత్త పింఛను మంజూరు చేసేవారు. ఆ వార్డు జన్మభూమి కమిటీ సభ్యుడికి కొంత మొత్తం చెల్లిస్తేనే కానీ ఆ పనిచేసే వారు కాదు. ఆ డబ్బు కోసం పేదలు అప్పులు చేయాల్సిన దుస్థితి ఎదురయ్యేది.

– పొట్ల సురేష్, న్యాయవాది, వైఎస్సార్ సీపీ తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు

జన్మభూమి కమిటీ సభ్యులంటే భయపడేవారు



జన్మభూమి కమిటీని చూస్తేనే పేదలు భయపడిపోయేవారు. చంద్రబాబు హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటుచేసిన జన్మభూమి కమిటీలు ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చేశాయి. ఇప్పుడైతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలకు అర్హతే ప్రామాణికంగా అన్ని పార్టీల వారికి వలంటీర్ల ద్వారా సంక్షేమం పారదర్శకంగా అందుతుంది.

– కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ ఇరగవరం మండల అధ్యక్షుడు

జగన్ పాలనలోనే ఆలయాల అభివృద్ధి



రేలంగిలో మంటలమ్మను దర్శించుకున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలోనే రాష్ట్రంలోని ఆలయాలు అభివృద్ధి చేశామని మంత్రి, తణుకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇరగవరం మండలంలోని రేలంగి గ్రామంలో మంటలాంబ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ పురతన దేవాలయాలను భక్తుల, విరళాలు, ప్రభుత్వ సాయంతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు నడిపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేయాలని ఎమ్మెల్యేగా నన్ను, ఎంపిగా గూడూరి ఉమాబాలాను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పులుపు అనిల్ దంపతులు, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, నాయకులు పులుపు సునీల్, చేబ్రోలు పెద్దిరాజు, వద్దే మార్కేండేయులు ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆర్థికంగా ఆదుకున్న సీఎం జగన్

గ్రామాల్లో ఉత్సాహంగా వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారాలు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమమే కోవిడ్ సమయంలో పేదలను ఆర్థికంగా ఆదుకుందని ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు అన్నారు. తణుకు14వ వార్డులో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. మీకు ఎవరు మంచి చేశారో కూడా ఒకసారి ఆలోచన చేయాలని, మంత్రి కారుమూరి నిరంతరం ప్రజల్లోనే ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. తణుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి కారుమూరిని, ఎంపీ అభ్యర్థినిగా గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తిర్రే విజయకృష్ణ, దున్నాల ఉమామహేశ్వరరావు, కొఠారు రామాంజనేయులు, వేండ్ర రాణి పాల్గొన్నారు.

22వ వార్డులో..

సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో మంత్రి కారుమూరి తణుకు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలంతా దృష్టిలో ఉంచుకోవాలని రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అల్లుడు దిలీప్ కుమార్ అన్నారు. తణుకు 22వ వార్డులో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్న మంత్రి కారుమూరిని తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, గెద్దాడ శ్రీకాంత్, వన్నెంరెడ్డి మురళీమోహన్, కోటిపల్లి శ్రీను, షేక్ సలీం, డాక్టర్ దాట్ల సుందరరామరాజు, సప్పా బలరామకృష్ణ, తాటిపర్తి వాసు, ఉండ్రాజవరపు గీత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ముద్దాపురంలో ఇంటింటా ప్రచారం

తణుకు టౌన్: రాష్ట్రంలో మరోసారి సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని తణుకు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆధ్వర్యంలో తణుకు రూరల్ మండలం ముద్దాపురం గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం ముద్దాపురం గ్రామంలో ఇంటింటికి తిరిగి తణుకు ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు, నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు టీ నాగ సత్యనారాయణ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, నాయకులు ముళ్లపూడి బాబూరావు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలన పట్ల ప్రజల నుంచి విశేష స్పందన

అత్తిలి: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన పట్ల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. శుక్రవారం అత్తిలి శివారు మట్టపర్తిగర్వు, చినపేటల్లో వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా పైబోయిన మాట్లాడుతూ ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. ప్రజలకు మంచి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి మీ ఆశీస్సులు అందించాలని కోరారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకుని ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణి ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల నాయకులు గారపాటి నాగరాజు, రంభ సూరిబాబు, కోరుకొల్లు వెంకట్రావు, కంకటాల సతీష్, సబ్బితి రాజేష్, గంటా నాగరాజు, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, శింగంశెట్టి శ్రీనివాస్, బుడితి సుజన్‌కుమార్, కట్టా అప్పన్న, పి సంపదరావు, ఫ్రాన్సిస్, బుంగా పద్మారావు, పెచ్చెట్టి రామకృష్ణ, ఆకుల చినబాబు, తీర్థాల శ్రీనివాస్, పైబోయిన శ్రీను, కాసగాని అబ్బులు, దాసిరెడ్డి భగవాన్, తదితరులు పాల్గొన్నారు.



తణుకు 14వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు



తణుకు అర్బన్ :22వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



తణుకు టౌన్: ముద్దాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, జెడ్పీటీసీ అన్నపూర్ణదేవి



ఇరగవరం: అనుమాజిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి కారుమూరి అల్లుడు దిలీప్ కుమార్



అత్తిలి: చినపేటలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



తణుకు అర్బన్: 10వ వార్డులో ఎన్నికల ప్రచారంలో మంత్రి కారుమూరి కుమార్తె దీపిక

సంక్షేమ సారథి సీఎం జగన్

ఇరగవరం: బడుగు, బలహీను అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యం అని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అల్లుడు దిలీప్ కుమార్ అన్నారు. శుక్రవారం ఇరగవరం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఇరగవరం శివారు అనుమాజిపాలెం, చిన రాముని చెరువు, పిల్లివారిపాలెంలో దిలీప్ కుమార్ ఇంటింటికి వెళ్లి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సంక్షేమం కావాలంటే మళ్లీ సీఎంగా జగనన్నను గెలిపించుకోవాలని కోరారు. ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావును, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్కరు తమ అమూల్యమైన ఓటు ముద్రను ఫ్యాన్ గుర్తు పై వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వెలగల సాయిబాబా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, కె ఇల్లిందల పద్రు, ఇరగవరం సొసైటి అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, చవ్వాకులు శ్రీనివాస్, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ఎఎంసీ ఉపాధ్యక్షులు మమిడిశెట్టి శ్రీనివాస్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కుడిపూడి నాగ సత్యనారాయణ, కడలి కుమార్, శీలబోయిన శ్రీనివాస్, బొక్క శ్రీనివాస్, గంధం దానయ్య, పాల పాలేశ్వరరావు, జక్కంశెట్టి రాంబాబు, కౌరు తాతరావు, వీరవల్లి రామ కృష్ణ, ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామా పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం సీఎం జగన్

తణుకు అర్బన్: మీ కుటుంబానికి మంచి జరిగితేనే నాకు అండగా నిలబడమన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమని, అటువంటి నేతను ప్రజలు మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని మంత్రి కారుమూరి కుమార్తె దీపిక అన్నారు. తణుకు 10వ వార్డులో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. తణుకు అభివృద్ధిలో మంత్రి కారుమూరి చొరవను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడ్డ కారుమూరిని, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తణుకు కాపు సంఘ అధ్యక్షుడు వంటెద్దు ఈశ్వరప్రసాద్, యడ్లపల్లి సురేంద్ర, వార్డు నాయకులు కోన రమేష్, మలకలపల్లి సత్యనారాయణ, మూర్తి టైలర్, దుడిపే సూర్యచంద్రరావు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ఈనెల 25వతేదీ గురువారం నిర్వహించిన తన నామినేషన్ కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తన నామినేషన్ వేసే కార్యక్రమానికి మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రజలు పెద్దఎత్తున తరలిరావడం ఆనందంగా ఉందన్నారు.

కొట్టు వెంటే ఉంటాం: కొట్టు వెంటే ఉంటామని గొర్రెల శ్రీను, నిమ్మల నాని, బందారు నాగు లు స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో డిప్యూటీ సీఎం కొట్టు, ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం నాయుడులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ విజయానికి తాము కష్టపడి పని చేస్తామని చెప్పారు. నిమ్మల నాని మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో తాడేపల్లిగూడెం నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణ విజయానికి అహర్నిశలు కష్టపడి పని చేసామన్నారు. ఏదో కొద్దిగా బేధాభిప్రాయాలతో కొంచెం దూరంగా ఉన్నాం తప్ప మరి ఏమి కాదన్నారు. పార్టీ ఆదేశాలు, కొట్టు తమతో మాట్లాడటంతో పునరుత్తేజంతో ఈ ఎన్నికల్లో పని చేయడానికి ముందుకు వచ్చామన్నారు. అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం, కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, ముత్యాల ఆంజనేయులు, నేదూరి గంగాదరరావు, కొట్టు తాతాజీ పాల్గొన్నారు.

విద్యార్థిని కార్తికేయనిని సత్కరించిన మంత్రి కారుమూరి



తణుకులో పదో తరగతి విద్యార్థిని కార్తికేయనిని సత్కరించిన మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన సౌకర్యాల ఫలితమే నేటి పదో తరగతి పరీక్షా ఫలితాలకు నిదర్శనమని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తణుకు జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాల (గరల్స్ హైస్కూల్) విద్యార్థిని కొంపెళ్ల శ్రీసత్య కార్తికేయని 581 మార్కులు సాధించిన సందర్భంగా శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో విద్యార్థినిని మంత్రి కారుమూరి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 600 మార్కులకుగాను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా 581 మార్కులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సాధించిందంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఏవిధంగా బోధన జరుగుతుందో గమనించాలని సూచించారు. తండ్రిలేని చదువుల తల్లి కార్తికేయని భవిష్యత్తులో ఏమి చదువుకున్నా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. విద్యార్థినిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను కూడా అభినందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ వైస్ చైర్మన్ కత్తుల జెస్‌పాల్, గంజి సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా గణపతి ఆలయ ప్రతిష్ఠ

పెంటపాడు: మండలంలోని పరిమెళ్ల గ్రామంలో శుక్రవారం నూతననంగా నిర్మించిన ఆలయంలో గణపతి ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాత ఇందుకూరి రామరాజు మనుమడు వెంకట సుబ్బరాజు(గణపవరం) ఆధ్వర్యంలో రూ.5 లక్షల ఖర్చుతో నిర్మించిన స్వామివారి ఆలయ ప్రతిష్ఠ పురస్కరించుకొని అర్చకులు బాదంపూడి ఫణిశర్మ ఆర్చకత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ ఇందుకూరి నాగరాజు, ఆకుతీగపాడు సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొణతాల వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు నిమ్మల పెదకాపు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భూములు మరియు ముత్యాలమండపాలు లీజు హక్కునకు టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

క్ర.సం.	దేవస్థానం పేరు	[illegible]	[illegible]	[illegible]	ధరావత్తు	పాట తేది
1	శ్రీ [illegible]	784 423 385	3 25 5 47 2 28	[illegible]	5000/- 6000/- 5000/-	ది.09-05-2024 [illegible]
2	శ్రీ [illegible]	105/2	1-68	3 [illegible]	2000/-	ది.09-05-2024 [illegible] 11.30
3	శ్రీ [illegible]	[illegible]		[illegible]	5000/-	ది.09-05-2024 [illegible]

షరతులు: [illegible]

తణుకు: ది.24.04.2024

ముత్యాల సత్యనారాయణ
[illegible]
సెల్: 9866397623

చంద్రబాబుకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రానున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు తెలిపారు. పట్టణంలో మాల మహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ఎస్సీల మధ్య చిచ్చు పెట్టేందుకు చంద్రబాబు నిరంతరం ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. ఎన్నికల సమయంలో మందకృష్ణను ముందుకు తెచ్చి, జాతికి ఏదో మేలు చేస్తున్నట్లుగా నటించడంలో చంద్రబాబు సిద్ధహస్తుడన్నారు. మందకృష్ణ బీజేపీకి మద్దతు ఇవ్వడం సరి కాదని హితవు పలికారు. కులాల మధ్య చిచ్చుపెడుతున్న చంద్రబాబును, మతాల మధ్య చిచ్చు పెడుతున్న భారతీయ జనతా పార్టీని ఎస్సీలు, క్రైస్తవులు, ముస్లింలు వ్యతిరేకించాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేసి వారికి బుద్ధి చెప్పాలని మంగరాజు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు సునీల్ బాబు, బాలకృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన బైబిల్ శిక్షణ తరగతులు

తణుకు: మండలంలోని మండపాక గ్రామంలో రేమా బ్లెస్సింగ్ చర్చి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన బైబిల్ విజ్ఞానంపై ప్రత్యేక తరగతులు శుక్రవారంతో ముగిశాయి. చర్చి పాస్టర్ రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో పాస్టర్లు నవీన్, గౌతమ్‌లు చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అందరినీ ఆకట్టుకున్నాయి.